


ప్రేమంటూ కలిగితే, హృదయాలు పెనవేసుకుపోతే, ఎంత ఇష్టం అయిన దాన్నయినా తృణప్రాయంగా విడిచిపెట్టచ్చు అంటారు. తను ఎన్నింటినో అధిగమించి, మరెన్నింటినో వదులుకొని, తనవాళ్ల మాట కాదని, తను ప్రేమించిన స్వాతితో అలానే బ్రతుకు పెనవేసికొన్నాడు.

రెండేళ్లు ఎంతలో గడిచిపోయాయ్. వెలితి కనిపించనే లేదు. తన కళ్లల్లో, గుండెల్లో అణువణువులోనూ స్వాతే. తనేం చేస్తున్నా స్వాతి కోసమే. ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే పార్ట్‌టైం జాబ్ చేసి స్వాతిముచ్చట్లు తీర్చాడు. కలవారింటినుంచి వచ్చి లేమిని అనుభవించవలసి వస్తోందే అని తను నొచ్చుకోకుండా అడగకుండానే అన్నీ అమర్చిపెడుతున్నాడు. స్వాతి మాత్రం? తనని ప్రాణాధికంగా చూసుకోవడం లేదూ. తను చీరలు ఖరీదయిన ఫ్యాన్సీ సామానులు కొనుకొచ్చినప్పుడల్లా "ఇవ్వన్నీ అవసరం లేదండి. ఊరికే శ్రమపడి సంపాదించి నన్ను మురిపెం చేయనక్కరలేదు. మనకున్నదాంతో తృప్తిపడగలను. ముందు మీరా పార్ట్‌టైం జాబ్ మానేయండి. సాదాచీరలు

# లంచ్ బాక్స్

## సత్యవాడ సోదరీమణులు

కట్టుకొని, మీరు ప్రసాదించిన సౌభాగ్యంతో చేతులనిండా మట్టిగాజులు వేసికొని, మీ అనురాగాన్ని ఆభరణాలుగా చేసుకొని, మీ ఆప్యాయతే నుదుటి కుంకుమగా దిద్దుకొని, మీ ఇల్లాలుగా కళకళలాడే జీవితంచాలు నాకు" అంటున్న తన సహచరి కళ్లల్లో పరిపూర్ణమైన సంతృప్తినే చూశాడు తను. "నువ్వలా అనేస్తున్నావు కాని మీ పుట్టింట్లో ఎంత అపురూపంగా పెరిగావో నాకు తెలియనిదా! మన పరిచయమైన తొలిరోజుల్లో వన్నె వన్నెల సీతాకోకచిలకలా నీ స్నేహితురాళ్ల మధ్య మెరిసిపోయేదానివి. కట్టినచీర కట్టేదానివా?... పెట్టిననగ పెట్టేదానివా? ఒక్కోసారి సాక్షాత్తు లక్ష్మీదేవిలా సాక్షాత్కరిస్తే, మర్నాడే మాడరన్‌గా ముస్తాబై చిలిపిగా చిందులేసేదానివి. నీ అవతారాలన్నీ చూసి నవ్వుకునేవాణ్ణి. నువ్వు నాకు దగ్గరవ్వాలని ప్రయత్నించినప్పుడు నీ స్థాయికి తగనేమో అని భయపడేవాణ్ణి. ఆ భయాలన్నీ పటాపంచలు చేసేశావ్. ప్రేమకి అడ్డుగోడలుంటాయా అంటూ భవంతులను, భోగభాగ్యాలను కాలదన్నుకుని నాదానివై పోయావ్. నిజానికి ఏమివ్వగలను నేను నీకు. చేతనైనంతలో అయినా నీ ముద్దుమురిపాలు తీర్చాలిగా. కాదనకు" అంటుంటాడు. ఒకరి భావాలకు మరొకరు విలువనిస్తూ, ఒకరి అభిప్రాయాలను ఇంకొకరు గౌరవిస్తూ ఈ అపురూప దాంపత్యలత రోజురోజు కొత్త చిగుళ్లు వేస్తూనేవుంది. పున్నట్టుండి ఈ లతకి ఇలా చీడపట్టిందేమిటి? సుకుమార్ తలపట్టుకున్నాడు.

000

అమాంతం తనపైకి ఉరికి గాఢాలింగనంలో సుకుమార్ తన చెక్కిళ్లపై ముద్దుల వర్షం కురిపించేస్తున్నాడు. ఓ పెనుభూతం మీదపడి కొరుక్కుతింటున్నంతగా కంపనం కలిగింది స్వాతికి. "ఛీ... ఛీ... ఏమిటిది?... భర్త అయినంత మాత్రాన ఇష్టాఇష్టాలతో పనిలేకుండా వేధించుకుతినే హక్కు మీకులేదు. మీరంటే నాకు అసహ్యం. చెప్పానుగా... ఇక మనమధ్య ఈ ఆనందానికి తావులేదు" విసురుగా భర్త నుండి విడిపించుకొని, దిగ్గున లేచింది. ఎదురుగా ఉన్న సోఫాలో అమాయకంగా నిద్రపోతున్నాడు సుకుమార్. అయితే ఇదంతా కలా?... కళ్లు నులుముకుని గడియారంవైపు చూసింది. పన్నెండుకూడా కాలేదు. పాడురాత్రి కరిగిపోతేగా! సాయంత్రంనుండి ఏడిపిస్తున్నది చాలక, తన పాటికి తను పడుకుంటే కలలోకి వచ్చే ఏడిపించాలా. చిరాగ్గా భర్తముఖంలోకి చూసింది. ఎంత నిశ్చింతగా నిద్రపోతున్నాడు. మగమహారాజుకదూ! ఏం చేసినా చెల్లుతుంది. అతని బండారం బయటపడదనే అనుకున్నాడు. భార్యకన్నా వేరే లోకంలేదు, అన్నట్టు నటిస్తూ గుట్టుగా వ్యవహారం సాగించవచ్చనే అనుకున్నాడు.

## ఐశ్వర్యారాయో ఏమో, ఐబాబో ఏం ఫిగరో?



ఆమె అచ్చంగా ఐశ్వర్యారాయ్‌లాగే వుంటుందట. ఐశ్‌ను చూస్తే ఆమెనూ, ఆమెను చూస్తే ఐశ్‌నూ చూడక్కరలేదనీ, ఇద్దరూ మక్కీకి మక్కీగా ఒక్కలాగే వున్నారనీ దుమారం లేచింది. మోడల్ రంగం నుంచి వచ్చిన ఆ సుందరి దియామిర్జా. ఇటీవల దియను గురించి చాలా కబుర్లు వినిపిస్తున్నాయి. శోభా డే దియను ఐశ్వర్యారాయ్ అని భ్రమించి ఓ పత్రికలో రాయడం వాటిలో ఒకటి. ఐశ్వర్యారాయ్‌ని పోలి వుండటం వల్ల తనకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయంటూంది దియ. మిస్ ఇండియా కిరీటం గెలుచుకున్నాక సినిమాల్లో చేరుదామనుకుందట కానీ మోడల్స్‌ను అంతగా పట్టించుకోరని తటపటాయించిందట. రెండు మ్యూజిక్ వీడియోల్లో చేసింది. అవి చూసిన అనుపమ్ ఖేర్ తను తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఓమ్ జై జగదీశ్'లో అవకాశమిచ్చాడు. అటు పైన వాశూభగ్నానీ చిత్రంలో అర్జున్‌రామ్‌పాల్‌తో చేస్తూంది. ప్రేమలో దెబ్బ తిని వున్న బాడీఖాన్ సల్మాన్‌ఖాన్‌కు సరికొత్త గర్ల్ ఫ్రెండ్ దియేనని అందరూ చెప్పుకుంటున్నారు. ఐశ్వర్యకూ, దియకూ అస్సలు పడనే పడదు. ఇద్దరూ అకస్మాత్తుగా తటస్థపడినా ఒకర్నొకరు చూసుకోరు-అని కూడా జనం చెప్పుకుంటారు. కానీ నిజానికి ఐశ్వర్యను దియ కలిసింది రెండుసార్లే. అయినా అర్థం లేని పుకార్లు లేచాయని బాధ పడుతూంది దియ.

"నేను ఐశ్వర్యారాయ్, సుస్మితాసేన్‌లకు వీరాభిమానిని. వాళ్ల ఫోటోలు నా గదిలో వుండేవి. సల్మాన్‌ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్నానని నాకూ, అతనికీ ఏదో వుందని తెగ రాస్తున్నారు. తొలిసారి చదివి విపరీతంగా ఏడ్చాను. తరువాత ఇక్కడిలా జరగటం మామూలని తెలుసుకుని స్తిమితపడ్డాను. పాపం, సల్లూను తలుచుకుంటే జాలి కలుగుతుంది. అతను నటించిన ప్రతి హీరోయిన్‌తోనూ అతనికి సంబంధాలున్నాయని తెగ ప్రచారం చేశారు. అయినా అందరూ అతనంటే పడి చస్తారనుకోవడం క్రేజీ కాదా? నేను ఐశ్వర్యారాయ్ లాగున్నానని నన్నతను చూట్టానికి వస్తున్నాడనీ అంటున్నారు... ఇదెంత చెత్తగా వుంది? అంతే కాదు, లారాదత్తా బోయ్ ఫ్రెండ్‌తో కూడా నాకు సంబంధాలున్నాయట! నాకే తెలియని నా సంబంధాల గురించి వీళ్లకెట్లా తెలుస్తాయబ్బా? నేను పని సరిగ్గా చేయనని ఒక వెబ్ సైట్‌లో చదివి ఆశ్చర్యపోయాను. ఉదయం ఎనిమిది గంటల నుంచి మరునాటి ఉదయం మూడు గంటల వరకూ పని చేస్తాను. మరి నన్ను అన్ ప్రొఫెషనల్ అని ఎలాగంటారు? ఇక నా వ్యక్తిగతజీవితమంటారా, నాకది లేనే లేదు. నేను ప్రేమించదగిన మగాళ్లేరీ? ఎక్కడా? కనిపించరే! అయినా ఇతరవిషయాలకు నాకు తీరికే లేదు! నాకు తిండీ, నిద్రా, ఊపిరీ, ప్రాణం అన్నీ, అంతా సినిమాలే!" అంటూంది కాస్త కోపంగానే దియ. ఇట్లాగే అంది కొత్తల్లో ఐశ్వర్యారాయ్ కూడా. భూమి గుండ్రంగా వుందని... మళ్లీ ఐశ్వర్యే వినిపిస్తూంది కదూ? చూద్దాం, ఎవరెవరికి పోటీ అవుతారో!

ఎస్.

స్వాతి మనసు కోపంతో కుతకుతలాడిపోతోంది. టేబుల్‌పైన సరికొత్త పళ్లెం, దానిలోని తాంబూలం, నగలు, ఘుమఘుమలాడే దబ్బపాయంత లడ్డుండా తనని చూసి నవ్వుతున్నట్టు అనిపించింది. తను ఈ పేరంటానికే వెళ్లకపోతే పతిదేవుని చాటుమాటు సరాగాలు తనదాకా రాకపోయేవి. తను ముచ్చటపడి వెళ్లిన కాంతమ్మగారి ఇంటి ఉయ్యాల పేరంటం కళ్లముందు కదలాడసాగింది.

000

తను వెళ్లగానే "వచ్చావా తల్లీ" అంటూ కౌగిలించుకొని లోనకి తీసుకెళ్లారు కాంతమ్మగారు. హాలంతా పేరంటాళ్లతో నిండిపోయింది. తను తెలిసినవాళ్లకి, తెలియనివాళ్లకి ప్రత్యేకంగా తనను పరిచయం చేశారావిడ. ఆడపిల్ల పుడితే అపురూపంగా పెంచుకోవాలి అనుకున్న ఆవిడ కూతురికోసం ఎదురుచూస్తూనే నలుగురు కొడుకుల తల్లి అయ్యారు. స్వాతిని చూసిన మరుక్షణమే కాంతమ్మగారికి పుత్రికావాత్సల్యం కలిగింది. తల్లిదండ్రుల్ని వదులుకొని కోరుకున్న మగనితో కొత్తజీవితాన్ని ప్రారంభించిన స్వాతికి కూడా ఆవిడ ఆప్యాయత తల్లిని మరిపించింది.

"ఏమిటో స్వాతి! నీలో ఇంత ప్రత్యేకత. పెద్ద ముత్తయిదువలు వచ్చేదాకా ఆగాలి అంటారు. కాని కాంతమ్మగారు నీకోసం చూస్తున్నారు" స్వాతికి బాగా పరిచయం ఉన్న సుజాత అంది.

"మా అత్తగారికి స్వాతితో ఏర్పడిన బంధం అలాంటిది. నిజం చెప్పొద్దు. మా ఇంటిల్లిపాదికి స్వాతి ఆరోప్రాణం" బాబుని స్వాతి ఒడిలో వేస్తూ అంది సునంద.

"నిన్ను చూస్తుంటే ఉడుకుమోత్తనం వస్తోందే. ఇంతమంచి కుటుంబంతో కలిసిపోయి లక్కీఛాన్స్ కొట్టేశావు" స్వాతి తలమీద చిన్నమొట్టికాయ వేసింది సుజాత.


"అవునే సుజీ! ఇదంతా నా అదృష్టం. వీళ్ళంతా నన్నింత ఆప్యాయంగా చూసుకోవటం నా జీవితంలోని తీయని వరం" ఆనందంగా అంది స్వాతి. అప్పుడే వంటింట్లోంచి వస్తూ వాళ్ల మాటలు వింటున్న శాంతాదేవి "ఈ అమ్మాయి సుకుమార్ భార్య స్వాతి కదూ!" అంటూ స్వాతి దగ్గరగా వచ్చి కూర్చుంది. "అవునండి, సుకుమార్, మీరు ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారనుకొంటాను" అంది సునంద.

"అదే, అదే, ఆ అబ్బాయి..." ఏదో చెప్పబోయి ఆగింది. తన భర్త గురించి ఈవిడ ఏమి చెప్పాలనుకుంటోంది? స్వాతి మనసు రెపరెపలాడింది. ఆవిడ వాయనం తీసుకొని లేవగానే, తనూ "సుకుమార్ వచ్చే వేళయింది" అనేసి ఆమెతోనే బయటకు వచ్చేసింది. "ఎదురిల్లే మాది. ఒక్కసారి రండాంటి" చెయ్యి పుచ్చుకొని తన ఇంటికి లాక్కెళ్లింది.

"అబ్బే, బాగా పరిచయం ఉంటే తప్ప నేను ఎవరిళ్లకి వెళ్లనమ్మాయ్. నిన్ను చూస్తాంటే జాలేసి నీ మాట తోసిపుచ్చలేదు", కుర్చీలో కూర్చుంటూ అంది. మళ్లీ స్వాతి మనసులో ఏదో కంగారు బయలుదేరింది. "మీరేదో దాస్తున్నారాంటీ. ఇందాక మావారి గురించి ఏదో చెప్పాలనుకొని ఠక్కున ఆపేశారు. ఏమీ అనుకోనులెండి. ఆయన మీతో నా గురించి ఏమైనా అన్నారా? నాకోసం చాలా శ్రమపడుతున్నారు. వద్దంటే వినిపించుకోరు. ఉన్నదాంట్లోనే సర్దుకుపోదాం అంటాను. పని ఎక్కువై, అలసట, చికాకు ఆయన్ని చుట్టుముట్టుకూడదని" అంది.

"అబ్బే, అదేం లేదమ్మా! నీకోసం ప్రత్యేకంగా సంపాదించేదేముంది? భార్యని సుఖపెట్టడం, ప్రతి మగాడు చేయవలసిన పనేగా, అయినా నాతో ఎప్పుడూ మాట్లాడడులే? ఓ ఆరు నెల్లలో రిటైర్‌కాబోతున్న నేను వయసులో ఉన్న పిల్లనా?" పగలబడి నవ్వింది శాంతాదేవి. మళ్ళీ ఆమే "అదేనమ్మా! నీతో చెప్పకేం? కాని, మా ఆఫీసులో స్టెనో కీర్తి లేదు! ఆ అమ్మాయితో ప్రతిరోజూ ఏవో మంతనాలు, ఆఫీసుకి రావటమే తడవు. ఇద్దరూ చెవులు కొరుక్కుంటారు. చనువుగా సుకుమార్ బ్యాగ్ తెరిచి ఏవేవో పెడుతూ ఉంటుంది. తీసికొంటూ ఉంటుంది. నాకీమధ్య కాస్త చూపు మందగించిందిలే. అయినా అప్పుడప్పుడు ఇలాంటి పాడుపనులు కంటపడుతూ ఉంటాయి. నువ్వా, నా అన్నవాళ్లందరినీ వదిలిపెట్టి వచ్చేశావు. ఈ మహానుభావుడు రేపు నీకేదైనా అన్యాయం చేస్తే నీకోసం తెగ బాధపడిపోతున్నానమ్మా! ఇప్పటిదాకా నీతో నాకు పెద్ద పరిచయం లేదు కదూ! ఈ పేరంటంలో నిన్ను చూశాక ఉండబట్టలేకపోయాను. ఏమీ అనుకోకు తల్లీ, కాస్త జాగ్రత్త పడతావని, అతగాణ్ణి హద్దులో పెట్టుకుంటావని, నీ చెవిన పడేశాను" అంటూ దిగ్గున లేచింది. స్వాతి ఆవిడ మాటలవల్ల తగిలిన షాకునుండి తేరుకోకుండానే చల్లగా జారుకుంది.

మంచం మీద వాలిపోయి తలగడలో ముఖం దాచుకుని, వెక్కి, వెక్కి ఏడ్చింది. తను వలపు విరులన్నీ ప్రోగుచేసి ఎప్పటికీ వాడని అనురాగమాల అల్లుకున్నాననుకుంది. కాని ఒక్కో పువ్వు, ఒక్కో నిప్పురవ్వ తన ఎదను కాల్చేస్తున్నాయి. తనెంత దగా పడింది. ఎంతోమంది ఆడపిల్లల్లా ఉరకలేసే వయసు తొందరలో ప్రేమలోపడి ఖచ్చితంగా పొరపాటే చేసింది. సుకుమార్ ఇలాంటి మనిషని కలలోకూడా ఊహించలేకపోయింది. పేరుకు తగ్గ రూపం, అని అందాన్ని మించిన అంతఃసౌందర్యం అతనికుందని వలచి వరించింది. తనని కాలు క్రిందపెట్టనివ్వకుండా, అల్లారుముద్దుగా పెంచిన అమ్మా, నాన్న తను కోరకుండానే మనసు తెలిసికొని తన సరదాలు తీర్చే అన్నయ్య. తనంటే ప్రాణం ఇచ్చే అక్కయ్య "మా బుల్లి యువరాణి" అంటూ తను వంటింటి ముఖం చూడబోతే వారించి, అన్నీ అందించి గారాలు చేసే వదిన, "నీ పెళ్లి కళ్లారా చూడాలని ఈ జీవుడింకా ఉందే అమ్మడూ!" తన ఒళ్లంతా ఆప్యాయంగా నిమిరే ఎనభైపైబడిన తాతమ్మ, అందరూ తన మనసు నాక్రమించుకొని "మా మాట కాదని, ఆ ద్రాష్టుడికోసం గడపదాటావ్. ఇప్పుడు నీకేం ఒరిగిందే?" ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు.



మమతలమందిరంలాంటి పుట్టిల్లు వదులుకొని, దేవతల్లాంటి తన వాళ్లందరి అభిమానాన్ని తృణీకరించి, ప్రేమించినవాడే దైవం అనుకొని ఇంత సాహసించింది. తన ఆలోచలనెప్పుడూ దారి తప్పవనుకుంది. తన అంచనాలు ఎప్పటికీ తారుమారు కావనుకొంది. సుకుమార్‌తో తను ప్రేమలో పడగానే పసికట్టి మందలించాడన్నయ్య. మన ఆస్తిపాస్తులు చూసి ప్రేమా! దోమా! అంటూన్నాడా కుర్రకుంక. "మా నాన్న మన పెళ్లికి ససేమిరా ఒప్పుకోలేదు. తను కుదిర్చిన సంబంధం చేసుకోకపోతే నాకు ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వనంటున్నాడని చెప్పి చూడు! తోక ముడిచేస్తాడు" అన్నాడు నాన్న.

సుకుమార్ తన వెంటపడలేదని తను కోరుకున్నాకనే అతను సమ్మతి తెలిపాడని, అతనికి అలాంటి ఆశలేమీ లేవని తన నమ్మకాన్ని వాళ్ల ముందుంచింది. ఆ నమ్మకం ఇంతకాలం మహావృక్షమై పెరిగి చల్లని నీడనిచ్చింది. కల్పతరువై కమ్మని జీవితాన్ని ప్రసాదించింది. తీయని ఫలాలను, సుందర సుగంధ పుష్పాలను అందుకోబోయేసరికి వేళ్లతో సహా కూలిపోయింది.

ఆఫీసునుండి హుషారుగా ఇంటికి వచ్చిన సుకుమార్ వడలిపోయిన కలువపువ్వులా, వర్షించి, వర్షించి తన అస్తిత్వాన్ని కోల్పోతున్న చిన్ని మబ్బుతునకలా తన అర్ధాంగి కనిపించేసరికి ఖిన్నుడైపోయాడు. లాలనగా చుట్టూ చేయివేశాడు. "మీ నాటకానికి తెరపడిందిసార్. ఈ నటనలు చాలింక!" విసురుగా వంటింట్లోకి వెళ్లిపోయింది. "ఏమిటిది స్వాతి! నీకేమయింది ఇవ్వాళ?" వెనకే వచ్చి అన్నాడు. "మీ నిజస్వరూపం తెలిసింది" తను విన్నది, ఆపై తన ఊహాగానాలు అన్నింటికీ ఒకరూపం ఇచ్చి భర్తను నిలేసింది. సుకుమార్ బిగ్గరగా నవ్వేశాడు.

"అనుమానం ముందుపుట్టి ఆడది పుట్టిందంటారు. నువ్వు ఆకోవకి చెందిన దానివేనన్నమాట" తేలికగా అనేస్తుంటే స్వాతికి చిర్రెత్తుకొచ్చింది. ఇంకా మీ తప్పు కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తారెందుకు? మీ ఆకర్షణలోపడి స్వర్గంలాంటి నా పుట్టింటిని వదులుకొన్నాను. నీది స్వచ్ఛమైన ప్రేమ అనుకొన్నాను. మన దాంపత్యం యువజంటలందరికీ ఆదర్శం కావాలని నేను కన్నకలలు కల్లలు చేశారు కదండీ!" దుఃఖం, కోపం కలగలుపుగా అంటున్న భార్య మాటలు తుంచేస్తూ.

"అరే, స్వాతి నీకు మతిపోయిందా! నీ ధోరణి చూస్తుంటే నిజంగా నాకు పిచ్చెక్కేట్టుంది. నా మనసులో బ్రతుకులో నీకు తప్ప మరెవరికీ స్థానం లేదని తల పగలకొట్టుకు చెబుతున్నా వినవేం?"

"ఇక మీ మాయలో పడను. ఇప్పటికే సర్వస్వం పోగొట్టుకున్నాను."

"తొందర పనికి రాదు స్వాతీ! కాస్త సంస్కారంతో నిదానంగా ఆలోచించు" అనేసి మౌనంగా ఉండిపోయాడు. భార్యకి ఆపూట వంటచేసే మూడ్‌లేదని ఆపని తనే కానిచ్చి "భోజనం చేద్దాంరా స్వాతీ! నాకాకలిగా ఉంది" అని ఆమె రెండుచేతులు పట్టుకుని బ్రతిమాలాడు. "మీరెళ్లి తినండి" విసుగ్గా అంది. చేసేదిలేక భోజనం ముగించి సోఫాలో ఒరిగిపోయాడు.

ఆదమరచి నిద్రపోతున్న అతన్ని చూస్తున్నకొద్దీ స్వాతి మనసు రగిలిపోతోంది. ఆ రాత్రి ఆమెకు నిద్ర కరువైంది. రోజులు నిర్లిప్తంగా దొర్లిపోతున్నాయి.


భార్యలో మార్పుకోసం సుకుమార్ ఎదురుచూసి ప్రయోజనం లేకపోయింది. తన మొండివైఖరే తనది. ఎడమొఖం, పెడమొఖం, భోజనాలు వేరు, పడకలు వేరు, ఏం చెప్పబోయినా పెదవి విప్పబోతే చాలు కస్సుమంటుంది. "కల్లబొల్లి కథలు చెప్పి నన్ను మభ్య పెడతారు. ఎలాగూ మీ వంచెనలో పడనే పడ్డాను. ఇంకా నయం మాతృత్వపు మాధుర్యం అనే సంకెళ్లలో పడేలోగానే మీ అసలురంగు తెలిసిపోయింది శాంతాంటే పుణ్యమా అని. నాదారి నే వెదుక్కునే వరకు మీ పంచన ఉండనివ్వండి. మూర్ఖురాలినై నా అన్నవాళ్లు లేని ఏకాకినయ్యాను" అంటూ ఏడుపు లంఘించుకుంది.

'అతనికి మాత్రం భార్యతీరు చూస్తుంటే జాలేస్తుంది. అయితే ఏమైపోతుంది అమాయకురాలు. తనకు ఎవరూలేరని క్షణం క్షణం మనసు పాడు చేసుకుంటుంది. కొంపతీసి ఏ అఘాయిత్యమైనా తలపెడితే' ఆ ఆలోచన రాగానే గజగజ వణికిపోయాడు. వలపుకడలిలో హాయిగా విహరిస్తున్న తమ ప్రేమ నౌకను సుడిగుండంలోకి తోసేసింది శాంతాదేవి. అనుకున్న నిమిషం, ఛ, ఛ, మరొకరిని నిందించటం మానవనైజం. నిజానికి తప్పంతా తనదే, తాను జిహ్వాచాపల్యం అణచిపెట్టుకోలేకపోయాడు. పెళ్లికి ముందే ఈ విషయం స్వాతి ప్రస్తావించింది. "తమరు మాంసాహార భక్షకులుగా, నాకా వాడ గిట్టదు. నా స్నేహితురాళ్లంతా ఇప్పుడే నన్నాట పట్టిస్తున్నారు. ఇక మీరవన్నీ వండిపెట్టమంటే నా పని గోవిందా! కోళ్ళు, మేకలు పరపరా కోసేసి పాపం వాటి రక్తాన్ని కళ్లచూస్తూ వండి వడ్డించమంటే ఇప్పుడే భయమేస్తుంది బాబోయ్" అంది బేలగా.

"కాబోయే శ్రీమతి ఇదిగో అభయమిచ్చేస్తున్నాను. అంత నోరు కట్టుకోలేని వాణ్ణి కాను. ఇంత చిన్నదానికే బెంగపడిపోతావేం. నాకోసం ఎందరు ఆత్మీయులు, ఎన్ని సౌఖ్యాలని వదులుకొంటున్నావ్. అలాగే నేను కూడా నిన్ను వలచి వరించిన ఓ శాఖాహారపు రామచిలుకా! ఇకనుంచి, అదే, మన మంచాలు ఒకటైన దగ్గరనుంచి కంచం కూడా ఒకటే. నీ శాకపాకాలే నావి" అంటూ హామీ ఇచ్చేశాడు.

అయితే ఆ మాటకు కట్టుబడి ఉండలేకపోయాడు. అలవాటుపడ్డ జిహ్వా కదూ! తన సతీమణి చేసిపెట్టిన వంటకాలు ఆకలంటే తీర్చాయి. అసలుసిసలు రుచులకోసం తహతహ పడేది నాలుక.

కొనుక్కుతింటేపోలే, అనుకొని ఆ పనీ చేశాడు. ఖరీదు చూస్తునే కళ్లు తిరిగాయి. అదీకాక వ్యాపారసరళిలో సాగే హోటల్‌ఫుడ్‌కి రుచావచా!



ఒకటి రెండుసార్లకే గుడ్‌బై చెప్పేశాడు. తన కోరిక విచిత్రంగా తీరింది. ఇప్పుడు తను రొయ్యలవేపుడు, తనకు అతి ఇష్టమైన బంగారుతీగ చేపలతో ఇగురు, చికెన్‌బిర్యాని కీర్తి ఏది చేసినా లొట్టలు వేస్తూ తినేస్తున్నాడు. ఇది గోరంత కొండంతలై తమ ఇద్దరిమధ్యా అల్లకల్లోలాన్ని సృష్టించే సమస్య అయ్యికూర్చుంది. దీన్ని ఎలా పరిష్కరించుకోవటం? అదే మాట కీర్తితో అని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"ఓరీ! పిచ్చిసన్నాసీ! ఇంతమాత్రానికే బెంబేలు పడిపోవలా!" చనువుగా అతని షర్టు కాలరు పట్టి లాగింది. "నీకు అలానే ఉంటుందిలే, నాకయితే పద్మవ్యూహంలో ఉన్నట్టుంది. దాన్ని నేను ఛేదిస్తాను. ఈ కీర్తి నీకు అపకీర్తి రానిస్తుందా!" ధైర్యం చెపుతున్నట్టు సుకుమార్ వెన్ను నిమిరింది.

అప్పుడే అటువచ్చిన శాంతాదేవి ఆ ఇద్దరినీ ఎగాదిగా చూసింది. "దిక్కుమాలిన కలికాలం. నీతి, నియమాలు అడుగంటిపోతున్నాయి. ఆఫీసులోనికి వచ్చేది తలలు వంచుకొని ఎవరి పనులు వాళ్లు చేసికోవడానికి కాదా! మనుషుల్లో ఈ సరసాలు, పరాచికాలు, ఎక్కువైపోతున్నాయి" సణుక్కుంటూ గిరుక్కున వెనక్కు తిరిగింది. ఒక్కసారి ఉలిక్కిపడ్డారిద్దరూ.

సుకుమార్ బెదురుచూపులు చూశాడు. "ఇదుగో అబ్బాయి ఇంతమాత్రానికే భయమెందుకూ! చెప్పాగా, ఈ కీర్తి నీ సమస్యను క్షణంలో ఊది పారేస్తుంది." 'ఏమో కీర్తీ... నువ్వు తేలిగ్గా అనేస్తున్నావు, కానీ నాకు నమ్మకం లేదు. నేను, స్వాతి ఎప్పటిలా సుఖసంతోషాలతో హాయిగా గడిపేరోజులు ఇక తిరిగిరావేమో అనిపిస్తోంది. మనం మాట్లాడుకుంటున్నప్పుడే ఆ మహాతల్లి ఇటు రావాలా!'

"ఎందుకు రాదూ? నేను నీ దగ్గరికి రావడం చూసి పనిగట్టుకొని మరీ వచ్చింది. ఆవిడ స్వభావమే అంత. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కన్పిస్తుందని ఆవిడకి తోచినట్టల్లా ఎవరిగురించి అయినా ఏవేవో కథలు అల్లేస్తుంది."

ఇక కాపురాల్లో కలతలు, కల్లోలాలు మామూలే. "ఈ శాంతాదేవి పుణ్యమా అని విడాకులు తీసికొన్నవాళ్లు కూడా ఉన్నారు" సుకుమార్ కంపించిపోయాడు. "నీ విషయం అలా జరగదులే. ఎన్నిసార్లు చెప్పాలి. ఈ బాధ్యత నాది తండ్రీ!" అని "నువ్వు ప్రశాంతంగా ఉండు" మళ్లీ ధైర్యం నూరిపోసింది కీర్తి.

ఆఫీసుపని పూర్తికాగానే, అట్నుంచి అటే స్వాతి ఇంటికి బయలుదేరింది. తనలో అట్టుడికిపోతున్న 'ఈ సంగతి చిలవులు పలవులుగా స్వాతికి ఎంత వేగిరం చెప్పేస్తానా' అని ఆవిడ (శాంతాదేవి) ఆరాటం. సరిగ్గా అదే సమయానికి స్వాతి ఇంటితాళం పక్కవాళ్లకి ఇచ్చి, కీర్తి దగ్గరకి బయలుదేరింది. ఆఫీస్ ప్యూన్ పుణ్యమా అని ఇప్పటికి పట్టుకోగలిగింది కీర్తి అడ్రసు.

ఓరగా వేసివున్న తలుపు విసురుగా నెట్టేసి లోపలికెళ్లింది. ఆ అలికిడికి వంటింటి నుండి బయటకు వచ్చిన ఆమెను చూస్తూ "కీర్తి ఉందా?" కీర్తిపట్ల తనకు ఏర్పడిన కసి, కోపం మేళవింపుగా, గర్జించినట్టే అడిగింది... "ఈవిడ ఎవరయ్యుంటారబ్బా! కొంపతీసి స్వాతి కాదు కదా?" ఈ ఆలోచన వచ్చేసరికి ఆమె పెదాలపై ఓ మోస్తరునవ్వు చోటుచేసుకుంది. "అడిగేది మిమ్మల్నే. కీర్తి ఉందా అంటే వినిపించుకోరేమి? ఆవిడతో మాట్లాడాలి" రెట్టించింది.

"ముందు మీరు కూర్చోండి. ఇంట్లోకి వస్తూనే కీర్తికోసం ఇంత హడావుడి పెట్టేస్తున్నారు. మీకు ఆవిడతో ఏం పని? మీ పేరైనా చెప్పారు కాదు" కుర్చీ చూపిస్తూ అంది.


కాస్త స్థిమితపడి కుర్చీలో సర్దుకు కూర్చుంటూ "నా పేరు స్వాతి" అంది. తన తొందపాటుకు రవ్వంత బిడియపడింది. అయితే తను సరిగ్గానే ఊహించిందన్నమాట. ఆ కీర్తి తానే అని తెలిస్తే నమిలి మింగేసేట్టు ఉంది, ఈ అమ్మాయి వాలకం.

"నీ పేరు స్వాతి అంటున్నావు. అంటే నువ్వు సుకుమార్ భార్యవు కదూ!" కాస్త చనువుగా అంది. "ఆ వివరాలన్నీ మీకెందుకు. నాకు కావలసింది కీర్తి. ముందు ఆవిడ్ని పిలవండి" ఆ ముఖంలోకి కొరకొర చూస్తూ అంది స్వాతి.

"ఎందుకొచ్చినావేశం. ఏమిటో నాతో చెప్పొచ్చుగా. మీరు నాకు ఏమౌతారని మీతో చెప్పాలి. ఈ విషయం ఇంకొకళ్లతో చెప్పేది కాదు. నేనావిడతో ముఖాముఖీ మాట్లాడి తీరతాను" అంది ఇల్లంతా కలియజూస్తూ.

"నువ్వు ఎటు చూడనక్కర్లేదమ్మాయి. ఆ కీర్తి నీ ఎదురుగ్గానే ఉంది. నువ్వు మాట్లాడినా, పోట్లాడినా నాతోనే" "ఇదేమిటి కీర్తి అంటే ఈవిడ! ముఖమంతా స్ఫోటకం మచ్చలు, లోతుకుపోయిన కళ్లు, అక్కడక్కడ నెరిసిన జుట్టు. ఈ మనిషిలో ఆకర్షణ ఏముంది. తన భర్త లోబడిపోయాడు? ఖచ్చితంగా ముప్పయి అయిదేళ్లకు పైబడే ఉంటాయి", "అరే స్వాతి! ఏంటా పిచ్చిచూపులు, మాట్లాడతానన్నావ్, పోనీ పోట్లాడు. దేనికయినా నేను సిద్ధమే", స్వాతికి దగ్గరగా మరో కుర్చీ లాక్కొని కూర్చుంటూ అంది.

ఓ నిమిషం మౌనం తర్వాత మళ్లీ కీర్తే అంది "ఈ కురూపిలో నీ భర్త ఏం చూసి మోహించాడా? అని ఆలోచిస్తున్నావు కదూ!" స్వాతి మరొకసారి కీర్తి ముఖంలోకి చూస్తుండిపోయింది. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసికొని జీవితాంతం ఒకటై తోడునీడగా మనుగడ సాగించగలమని ఆలుమగలు అయ్యారు మీరు. అయినా నిన్నో దేవతలా ఆరాధిస్తూ నీ తోటిదే లోకం అనుకుంటున్న మీ ఆయన్ని చిటికెలో అపార్థం చేసుకోవటం ఏమిటి? ఎవరేది చెబితే అది నమ్మేయటమే. మా ఇద్దరి గురించి నీ ఆలోచనలు ఎంతదూరం సాగిపోతున్నాయి. నువ్వయితే 'ఇదిగో పులి అంటే, అదిగో తోక' అన్న సామెతకు ఏ ఆధారం లేకుండానే



అనుమానపు పెనుభూతానికి లొంగిపోయావు. కానీ నువ్వేమనుకున్నా సాక్షాత్తు శ్రీరామచంద్రుడమ్మా నా తమ్ముడు" కీర్తి మాట పూర్తి కానేలేదు కళ్లు తిరిగి పడిపోయింది స్వాతి.

"నిజమే స్వాతి, ఇందులో నా పొరపాటు కూడా ఉంది. ఆరేళ్ల క్రితమే నేనిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయివచ్చాను. కానీ వచ్చేటప్పుడే అమ్మ ఒట్టేయించుకుంది. "సుకుమార్ ఆ ఊళ్లోనే ఉన్నాడట. నిన్ను చూసి అభిమానం ఒలకబోస్తాడు. వాడి గుమ్మం ఎక్కొద్దు అని."

"నేను జాయినింగ్ రిపోర్టు ఇచ్చి నా సీట్లోకి వెళ్లేసరికి అదే సెక్షనులో ఎదురయ్యాడు వాడు. అంతే, అక్కాతమ్ముళ్ల బంధం ఒట్టు తీసి గట్టున పడేసింది "ఇంటికి రావే అక్కాయ్" అంటూ పట్టుబట్టాడు. "నువ్వు ఉన్న ఇంటిపిల్లను కట్టుకున్నావు గదా! ఉత్తచేతులతో ఎలా రమ్మంటావు? ఓ ఆరునెలలు గడువియ్యి. నా మరదలికో కెంపుల నెక్లెస్, కంచిపట్టుచీర బహుమతిగా తీసుకుని మరీ వస్తాను. అప్పుడే తను ఆశ్చర్యపోవాలి. అందాక నేనీవూళ్లోకొచ్చిన విషయం కూడా గుట్టుగా వుంచాలిసుమా! నువ్వా", అని నేనంటే స్వాతికలాంటి వ్యామోహాలే ఉంటే కోరినన్ను చేసుకుంటుందా! తను చాలా మంచిపిల్ల. తనకే కానుకలు అక్కర్లేదు. నీవు సాయంత్రం వస్తున్నావు" అన్నాడు. "కాస్త ఓపిక పట్టరా, నా సంతోషం నాది" అని ఒప్పించాను. అంతా సజావుగా జరిగిపోయేదే, ముఖంపై నీళ్లు చల్లి ముందు స్థిమితపడు. ఎందరో ఎన్నో కట్టుకథలు చెబుతారు. వాటికనేక కారణాలు ఉంటాయి. వాళ్లు పొందలేని దాన్ని మరొకరు పొందుతున్నా, వాళ్లు అనుభవించలేని సుఖాలు మరొకరు అనుభవిస్తున్నా ఓర్వలేని వాళ్లు ఉంటారు. ఆకోవకి చెందిందే శాంతాదేవి కూడా. తన ఇద్దరి కూతుళ్లు, అల్లుళ్లని కొంగున ముడేసుకోవాలనుకుంది. ఆ వచ్చినవాళ్లు మహాఘటికులు. పెళ్లాలచేత చాకిరి చేయించుకుంటారే తప్ప వీళ్ల కోరికలన్నీ తీర్చరు. ఎప్పుడూ ఎడముఖం, పెడముఖంగా ఉండే ఆ జంటల్ని చూస్తూ ఆవిడ ఆలోచనలు వికృతరూపం దాల్చాయి. ఎవరు పచ్చగా కాపురం చేసుకుంటున్నా, వాళ్ల మధ్య ఏవో అగాధాలు ఉండే ఉంటాయి అని ఊహించుకొని తృప్తి పడుతుంది. అలానే మా ఇద్దరి గురించి నీకు లేనిపోనివి నూరిపోసింది", అంది కీర్తి, స్వాతిచేత గోరువెచ్చని పాలు తాగిస్తూ.

"నువ్వు ఆవిడ చెప్పిందల్లా నమ్మేశావు. మీ చక్కని పొదరింటిని నరకం చేసుకొన్నావ్. నీవేమైపోతావో అని తల్లడిల్లిపోతున్నాడమ్మా వాడు" అంది కీర్తి.

"నాకేం వదినా... నేను బాగానే ఉన్నాను. నావన్నీ అపోహలేగా. నా మాటలతో చేతలతో ఆయన్ని హింసించాను. పాపం, ఆయన ఎంతగానో, ప్రయత్నించారు. ఈ నిజాన్ని చెప్పాలి అని. ఆయన ఏం చెప్పబోయినా ఎగిరిపడేదాన్ని. మీదంతా బూటకం అని మీరేం చెప్పినా కట్టుకథేనని, ఆయన నావెనక వెనక తిరుగుతూ మాట కలపబోయినప్పుడల్లా మీరు నోరెత్తారంటే నా శవాన్ని కళ్ల జూస్తారు. నాపాటికి నన్నుండనివ్వండి. ఏదో జీవనోపాధి వెదుక్కొని తొందరలోనే గుడ్‌బై చెప్పేస్తాను మీకు" అంటూ ఆయన నోటికి తాళం వేసేదాన్ని" స్వాతి వెక్కివెక్కి ఏడుస్తోంది.

కీర్తి మరదల్ని ఒళ్లోకి తీసుకుంది. స్వాతి తన పమిటకొంగుతో కళ్లొత్తుకుంటూ మళ్లీ అంది "తప్పంతా నాదే వదినా. కానీ ఆడపడచునంటూ మీరు నా ఇంటికే వచ్చేస్తే శాంతాదేవికీ అవకాశం ఉండేది కాదు"

ఈ "లంచ్‌బాక్స్" వల్ల కథ అడ్డం తిరిగింది. "అంటే ఏమిటొదినా?" స్వాతి ముఖం విప్పారింది. "ఏం లేదమ్మా! నీకోసం అన్నింటిని వదులుకున్నవాడు, ఒక్కదానికి మాత్రం దాసుడైపోయాడు. వాడి అవస్థ తెలుసుకొని, నేనే రోజూ మా లంచ్‌బాక్స్‌లు మార్చేదాన్ని. నీవు చేసిన వంటకాలు, నేను రుచి చూసి, నా చేతివంట వాడికి తినిపించేదాన్ని. వెర్రినాగన్న! ఎంత సంబరపడిపోయేవాడో! ఏదో రహస్యాన్ని పసిగట్టినట్టు ఆ శాంతాదేవి ఇంతా చేసింది.

"పోన్లెండి వదినా! చెప్పుడుమాటలు ఎంత ముప్పు తెచ్చిపెడతాయో నాకు తెల్సిందిగా. మీ తమ్ముణ్ణిక నేనెప్పుడూ బాధ పెట్టను. ఆయన నన్నర్థం చేసుకుంటే చాలు." " వాడికి నీ మనసు తెలియకనా స్వాతి. క్షణం... క్షణం నీకోసమే బెంగవాడికి. నీవు జరిగింది అర్థం చేసుకున్నావంటే ఎగిరి గంతులేయడూ!" "మీ నోటి వాక్యానా ఆయన నన్ను క్షమిస్తే చాలు" అంది స్వాతి. "నాకే కానుకలు వద్దు, మీరిప్పుడే మనింటికి వచ్చేయండి వదినా" పసిపిల్లలా మారాం చేసింది. "సరేపదా! నా పట్టుదల ఎప్పుడో ఎగిరిపోయింది. మనకిన్ని చిక్కులు తెచ్చిపెట్టిన లంచ్‌బాక్సే ముందు నీకు, మా తమ్ముడికి బహుమతి ఇస్తాను." స్వాతిని అక్కున చేర్చుకొని నవ్వుతూ అంది కీర్తి.

■


| | | |
|---|---|---|
| 6 | 5 | 10 |
| 11 | 7 | 3 |
| 4 | 9 | 8 |

సహాయానికి నమూనా

రూ. 8,50,000/–/- విలువగల
బహుమతులు
గెలవండి

| | | |
|---|---|---|
| 8 | | |
| | 9 | |
| | | 10 |

నిబంధనలు వర్తించును

మొదటి బహుమతి
మారుతి కారు ఎస్‌టిడి



ప్రత్యేక బహుమతి : హీరోహోండా
మోటార్ సైకిల్ లేదా కలర్ టీవి





కన్సొలేషన్ బహుమతి: మ్యూచ్యువల్ బెనిఫిట్ చెయిన్‌లింక్ పథకం క్రింద టు-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, ఫోటో గ్రాఫిక్ కలర్ కెమెరా, రిస్ట్‌వాచ్. ఇచ్చిన నమూనా ప్రకారం 9 ఖాళీ చదరాలను తయారు చేయవలెను. 5 నుంచి 13 సంఖ్యలను ఉపయోగించి నిలువుగా, అడ్డంగా మరియు ఐమూలగా కలిపినపుడు '27' రావలెను. ఒక సంఖ్యను ఒకసారి మాత్రమే ఉపయోగించవలెను. మీ ఎంట్రీలను ఎనవలప్/ఇన్‌ల్యాండ్/కాంపిటీషన్ పోస్టు కార్డుపై 10 రోజులలోగా సాధారణ పోస్టుద్వారా పంపవలెను. మొదటి 20 ఎంట్రీలకు టైటాన్ రిస్ట్‌వాచీ ఉచితంగా ఇవ్వబడును.




మీ ఎంట్రీలను పంపవలసిన చిరునామా :

Add : DHIRU - BHAVAN (B)
P.O. KATRI SARAI (GAYA)